



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

పొగతో ప్రమాదం

- టపాసులతో పలు వ్యాధిగ్రస్తులకు ముప్పు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్య నిపుణులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దీపావళి సాయంత్రం అంటేనే గ్రామాల నుంచి నగరాలకు వరకూ అన్నీ టపాసుల వెలుగులు, ఢాం..ఢాం శబ్దాలతో దర్శనమిస్తాయి. వాటితో పాటు మరో వైపు అన్నీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పొగ నిండుకుంటుంది. టపాసుల నుంచి వెలువడే పొగతో పలు వ్యాధిగ్రస్తులకు ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టపాసుల పొగకు అలాంటి వారు దూరంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. టపాసులు పేల్చడం వల్ల గాలిలో దుమ్ము, కాలుష్య కారకాల సాంద్రత పెరుగుతుందని, కాల్చిన తర్వాత, ధూళి కణాలు, రాగి, జింక్, సోడియం, సీసం, మెగ్నీషియం, కాడ్మియం మరియు సల్ఫర్ మరియు నైట్రోజన్ ఆక్సైడ్లు వంటి కాలుష్య కారకాలతో నిండిన చుట్టుపక్కల ఉపరితలాలపై స్థిరపడతాయని, ఈ అదృశ్య,హానికరమైన కణాలు పర్యావరణాన్ని ప్రభావితం చేయడంతో పాటు ఆరోగ్యాన్ని కూడా ప్రమాదంలో పడేస్తాయని అంటున్నారు.

టపాసుల్లోని రసాయనాలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి

రాగి : శ్వాసకోశాన్ని చికాకుపెడుతుంది.
కాడ్మియం : ఆక్సిజన్‌ను తీసుకువెళ్లే రక్తం సామర్థ్యాన్ని తగ్గించడం ద్వారా రక్తహీనతకు దారితీస్తుంది.
జింక్ : మెటల్ ఫ్యూమ్ ఫీవర్‌ని కలిగిస్తుంది, వాంతులను ప్రేరేపిస్తుంది.
సీసం : నాడీ వ్యవస్థకు హాని చేస్తుంది.
మెగ్నీషియం : మెగ్నీషియం పొగల వల్ల మెటల్ ఫ్యూమ్ ఫీవర్ వస్తుంది.
సోడియం : ఇది అధిక రియాక్టివ్ మూలకం. తేమతో కలిపినప్పుడు కాలిన గాయాలకు కారణమవుతుంది.

ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలి



దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులైన ఆస్తమా, సిఒపిడి, ఐఎల్‌డి, క్రానిక్ బ్రాంకైటిస్, ఎంఫైసిమాస్ వంటి వాటితో బాధపడేవారిపై టపాసుల పొగ ప్రభావం ఎక్కువగా పడుతుంది. పొగ వల్ల శ్వాసకోశ నాళ వాపు పెరిగి దగ్గు, ఆయాసం, ఛాతి ఉబ్బరం వంటి సమస్యలు ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. పొగ తగలకుండా ఇంటిలోనే దీపావళిని జరుపుకోవాలి. బయటకు వెళ్లాల్సి వస్తే మాస్కు ధరించి వెళ్లాలి. వ్యాధి లక్షణాలు ఎక్కువైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ పి.వి.చలమయ్య, పల్మనాలజిస్ట్, కిమ్స్ హాస్పిటల్.

అందరిపైనా ప్రభావం



బాణసంచా కొన్ని క్షణాల పాటు మన ఇంటి పైన ఉన్న మొత్తం ఆకాశాన్ని వెలిగించగలదు. పర్యావరణాన్ని, మన ఆరోగ్యాన్ని చాలా కాలం పాటు ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. టపాసుల నుంచి వెలువడే దట్టమైన పొగ శ్వాసకోశ మార్గాన్ని ప్రభావితం చేస్తుంది, ముఖ్యంగా చిన్నపిల్లలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. జలుబు, అలర్జీలతో బాధపడుతున్న వ్యక్తుల పరిస్థితిని చాలా తీవ్రంగా చేస్తుంది. ఇది గొంతు, ఛాతీపై తీవ్ర ప్రభాతం చూపుతుంది.

- డాక్టర్ మనోరాజు, జనరల్ ఫిజీషియన్.

వారికి ప్రమాదకరం



దీపావళి సమయంలో పార్టిక్యులేట్ మ్యాటర్ స్థాయిలు పెరుగుతాయి. ప్రజలు ఈ కాలుష్య కణాలకు గురైనప్పుడు, కంటి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలతో బాధపడే అవకాశం ఉంటుంది. ఫైర్ క్రాకర్స్ వల్ల వచ్చే పొగ, శబ్ద కాలుష్యం గుండె, శ్వాసకోశ మరియు నాడీ వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తులను ప్రభావితం చేస్తాయి. టపాసులు పేలినప్పుడు రంగులను ఉత్పత్తి చేయడానికి, రేడియోధార్మిక, విషపూరిత మూలకాలను ఉపయోగిస్తారు. ఇవి గాలిలో కలిసినప్పుడు ప్రజలలో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి.

- డాక్టర్ వసంత కుమార్, విజయదుర్గ కార్డియాక్ సెంటర్.

గర్భిణులు ఇంట్లోనే ఉండాలి



టపాసులు కాల్చే సమయంలో గర్భిణులు ఇంట్లోనే ఉండాలి. టపాసుల పొగ నుంచి వెలువడే వాయువులను పీల్చడం వల్ల తల్లికే కాకుండా బిడ్డకు కూడా అవి చేరే అవకాశం ఉంటుంది. తల్లికీ, బిడ్డకూ ఇద్దరికీ హాని కలిగే అవకాశం ఉంటుంది. శ్వాసకోశ ఇబ్బందులు ఉన్న గర్భిణులకు ఈ పొగ మరింత ప్రమాదకరం. పండుగ సమయంలో ఉపవాసం ఉండకూడదు. దీపాలు వెలిగించే సమయంలో కూడా శరీరానికి గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ జి.భార్గవి రెడ్డి, గైనకాలజిస్ట్, సుశ్రుత టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్.

అధికారులకు షోకాజ్ నోటీసులు

- జిల్లా కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రీవెన్స్ అర్జీల పట్ల అలసత్వం వహించిన వెల్దుర్తి, కృష్ణగిరి మండల వ్యవసాయ అధికారులు, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, ఆదోని ఎంపిడిఓలకు షోకాస్ నోటీసులు జారీ చేయాలని డిఆర్‌ఓను కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ద్వారా బాధితుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఆదోనిలో నీటి సరఫరాకు సంబంధించి వచ్చిన అర్జీ పరిష్కారంలో గడువు దాటడంపై కలెక్టర్ ఆదోని మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో గడువు దాటకూడదని ఎన్నో సార్లు సమావేశాల్లో, వీడియో కాన్ఫరెన్స్‌లో చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత సెక్రటేరియట్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్‌కు సంబంధించి ఇంకా 28 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించేందుకు దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. జెసి డాక్టర్ బి.నవ్య, డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

వ్యాపారుల సిండికేటును అరికట్టాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్


కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి వ్యాపారస్తుల సిండికేట్ అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉల్లి రైతులకు కనీసం రూ.3 వేల నుండి రూ.5వేల వరకు గిట్టుబాటు ధర కల్పించాలని జెసి డాక్టర్ బి.నవ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ... జిల్లాలో ఉల్లి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక ఎకరా పంట పండించడానికి లక్ష రూపాయలు ఖర్చు పెడుతున్నారన్నాంని, మార్కెట్‌కు వచ్చిన తర్వాత గిట్టుబాటు ధర అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నారని తెలిపారు. నాలుగు రోజులుగా ఈ నామ్ పనిచేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రిపూట రైతులు మేల్కొని పడిగాపులు కాసుకొని ఉల్లి పంట కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ మార్కెటును సందర్శించి రెగ్యులర్‌గా అమ్మకాలు జరిగేలా చూడడమే కాకుండా మిగతా సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు శేఖర్, మహబూబ్ బాషా, నాగన్న తదితరులు ఉన్నారు.

కేసు నమోదుకు వినతి

- అమానవీయ దాడిపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన కెవిపిఎస్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

'వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామంలో గురిగింజ హనుమక్కపై జరిగిన అమానవీయ దాడిపై మీరైనా స్పందించి కేసు నమోదు చేయించండి' అని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్‌ను కెవిపిఎస్ జిల్లా బృందం ఆశ్రయించింది. సోమవారం కర్నూల్ నగరంలోని ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్‌ను కెవిపిఎస్ బృందం ఆశ్రయించింది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, జిల్లా నాయకులు టి.లక్ష్మీనారాయణ, కె.రాజ్ కుమార్, జి.నాగరాజు మాట్లాడుతూ వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామంలో నాలుగు నెలల క్రితం దళిత మహిళ అయిన గురిగింజ హనుమక్క పంట భూమిని నాశనం చేసి, ఎందుకిలా చేశారు అని అడిగినందుకు విచక్షణారహితంగా దాడి చేసిన వారిపై ఇప్పటిదాకా ఎలాంటి కేసును నమోదు చేయలేదన్నారు. మానవ హక్కుల కమిషన్ చైర్మన్ అయినా స్పందించి కేసు నమోదు చేయించి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు. రత్నపల్లి గ్రామంలో మూడు తరాలుగా సాగులో ఉన్న భూమిని, ఆధిపత్య వర్గాలు మరో దళిత మహిళ పేరుతో కాల్ చేయాలనే కుట్రలో భాగంగానే సాగులో ఉన్న పేదలపై భయంకరమైన దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. రత్నపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 973ఏ2ఏలో దళితుల భూమిని లాక్కోవడమే కాకుండా, ఆ పక్కన ఉన్న భూములను సైతం, ఇష్టారాజ్యంగా, రెవెన్యూ అధికారుల సహకారంతో అమ్ముకుంటూ కోట్లు పోగేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ భూములను, పేదల భూములను రక్షించాలని. గురిగింజ హనుమక్కపై దాడి చేసిన వారిని అందరిని అరెస్టు చేయించాలని వారు కోరారు. కమిషన్ కార్యాలయ సమయం ముగియడంతో పోస్టు ద్వారా వినతిని పంపారు.



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

రక్తదానంతో ప్రాణదానం : ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



రక్తదానం చేస్తున్న ఎస్పీ బిందు మాధవ్

రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసే ప్రాణదాతలు కావాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు వారి సహకారంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో జిల్లా ఎస్పీ రక్తదానం చేశారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. విధి నిర్వహణలో కర్తవ్యమే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల స్ఫూర్తితో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో రక్తం దానం చేయడం చాలా కీలకం అవుతుందన్నారు. అలాంటి ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలన్నారు. రక్తదానం చేయడంపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఫ్రూట్ జ్యూస్, బిస్కెట్లను అందజేశారు. ఎఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్, డిఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసరావు, పోలీసు వేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ కిరణ్ పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఇచ్చిన పిలుపులో భాగంగా కర్నూలు కార్పొరేషన్ ముందు సోమవారం ఆందోళన నిర్వహించారు. రాజేష్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, నగర కార్యదర్శి విజయ్, నగర అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లాప్ డ్రైవర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జీవో 36 ప్రకారం క్లాప్ డ్రైవర్స్‌కు 24,500 రూపాయలు చెల్లించాలని కోరారు. వీరికి పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే విస్తరిస్తున్న పట్టణాల్లో భాగంగా కర్నూలు కార్పొరేషన్‌లో నగరం బాగా విస్తరిస్తుందని దానికి తగిన విధంగా సిబ్బందిని పెంచాలని కోరారు. పనిముట్లు, రక్షణ పరికరాలు భద్రత సౌకర్యాలు కల్పించాలని, వాహనాల మరమ్మతులు, యూనిఫామ్, చెప్పులు సబ్బులు, నూనెలు టవల్స్ సకాలంలో ఇవ్వాలని తెలిపారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా బకాయిలు చెల్లించాలని, వారి కుటుంబాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఇంజనీరింగ్ విభాగంలో జీవో నంబర్ 11 ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్ విధానం ఆధారంగా జీతాలు చెల్లించాలని కోరారు. రాబోవు కాలంలో సమస్యల పరిష్కారానికి కార్మికులు ఆందోళనకు సిద్ధంగా ఉండాలని కోరారు. యూనియన్ నాయకులు రఘు శేకర్, మద్దిలేటి, మహేష్, శ్రీనివాసులు, పరమేష్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు మురళీకృష్ణ, వేదికపై పిసిసి అధ్యక్షులు షర్మిల

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

డిసిసి అధ్యక్షుడు మురళీకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో జరిగిన పిసిసి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుండి పూర్తిస్థాయిలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ నియోజకవర్గ ఇన్చార్జిల సమన్వయంతో పనిచేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే నియోజకవర్గ కోఆర్డినేటర్లు మండల , గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు చెప్పిందే ఎన్ఎంసికి నివేదించాం

అడిషనల్ డిఎంఇ, ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల పత్రికల్లో ర్యాగింగ్ వార్తాంశాలపై విచారణ చేసి నివేదిక సమర్పించాల్సిందిగా కోరిందని వారి ఆదేశాల మేరకు కాలేజీ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడామని, లిఖితపూర్వకంగా కూడా వారి అభిప్రాయాలను తీసుకున్నామని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ జూనియర్ విద్యార్థుల మధ్య సుహృద్భావ వాతావరణం వుందని తెలిపారు. తమ విచారణలో క్లాసులకు షూష్ వేసుకొని వెళ్లాలని, నీట్‌గా షేవ్ చేసుకుని వెళ్ళాలని, స్టడీ పర్పస్ రిఫరెన్స్ కోసం స్టడీ యాప్‌లను సూచించారని, ఏ విషయంలో ఎక్కడ బలవంతం చేయలేదన్నారు. . ఇదే విషయాన్ని ప్రొఫెసర్ల కమిటీ ముందు, డిఎల్ఎస్ఎ జడ్జీ వద్ద కూడా చెప్పారని తెలిపారు. ఫ్రెషర్స్ డే కోసం బ్లడ్ గ్రూపింగ్ సందర్భంగా కలిసినప్పుడు సూచనలు చేశారని తెలిపారని, విద్యార్థులకు ఇబ్బంది కలిగించే, అభ్యంతరకరమైన, ఇష్టం లేని పనులు బలవంతంగా చేయిస్తే ర్యాగింగ్ కిందికి వస్తుందని అలాంటి పరిస్థితి ఇక్కడ లేదన్నారు. అయినప్పటికీ అన్ని చర్యలు తీసుకున్నామని, ఏదైనా సంఘటన జరిగితే సమాచారం ఇస్తే వారి పేర్లని గోప్యంగా ఉంచుతామని, భాద్యులపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విచారణ బృందంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, కాలేజీ ప్రిన్సిపల్, సూపరిండెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్‌లు డాక్టర్ హరి చరణ్ , డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ విజయానందబాబుల ఆద్వర్యంలో విచారణ నిర్వహించారు

జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో రాయితీ ఇవ్వాలి

- కలెక్టర్ కు ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

కర్నూలు జిల్లాలో ఉండే కార్పొరేట్ ప్రవేటు పాఠశాలలో చదువుతున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీని అందించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.గోరంట్లప్ప, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు హుసేన్, జిల్లాకన్వీనర్ నాగేంద్ర, నగర కార్యదర్శి శివకుమార్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా జిల్లాలో జిల్లా కలెక్టర్ల ఆదేశానుసారం 50 శాతం రాయితీ అందిస్తున్నారని, కర్నూలు జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు అందించేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. దాదాపు అన్ని జిల్లాలో 50 శాతం రాయితీ అందించేలా కలెక్టర్లు డిఇఒలకు అదేశాలు ఇచ్చారన్నారు. కలెక్టర్ స్పందిస్తూ తగినచర్యలు తీసుకునేలా సమాచార శాఖ డిడి జయమ్మకు రెఫర్ చేస్తూ ఆదేశించారు. నగర సహాయ కార్యదర్శి సునీల్ కుమార్, నాయకులు బ్రహ్మయ్య, శివశంకర్, ఎర్రమల, దామోదర్, సుందర్ రాజు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్లాట్లకు నంబర్లు వేయండి : సిపిఎం

కర్నూలు కలెక్టరేట్ : నన్నూరు గ్రామంలోని నిరుపేదలకు రెండో విడత కింద ఇచ్చినటువంటి ప్లాట్లకు నంబర్లు వేసి స్థలాలు చూపించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు డిప్యూటీ తహశీల్దార్‌కు సిపిఎం ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. నాగన్న, నన్నూరు శాఖ కార్యదర్శి ఎస్.మధుసూదన్ మాట్లాడుతూ నన్నూరు గ్రామంలో సర్వేనెంబర్ 1388/ఎ2లో గత సంవత్సరంలో ఇంటి స్థలాలు లేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు. లేఅవుట్ వేసి రోడ్లు వేసి నెంబర్ రాళ్లు పాతి అభివృద్ధి చేశారన్నారు. ప్లాట్లకు నంబర్లు వేయకుండా వదిలేసారన్నారు తక్షణమే తహశీల్దారు స్పందించి ప్లాట్లకు నంబర్లు వేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు మహేష్, మాసుంబాష, సలాంబాష, భాస్కర్ ,జగన్నాథం, రామచంద్రుడు, మద్దిలేటి, ఆకులమధు పాల్గొన్నారు.

మున్సిపల్ పదోన్నతుల జాబితా విడుదల

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతుల జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్‌పాల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబితాలపై అభ్యంత రాలను నవంబర్ ఒకటో తేదీలోగా తెలియజేయాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.



నవంబర్ 3 వరకు విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నవంబరు 3వ తేది వరకు జిల్లాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నిర్వహణలో భాగంగా సమగ్రత,అవినీతి నిర్మూలన, లంచం ఇవ్వచూపడం, తీసుకోవడం వంటి అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఛార్జీలు పెంచాకే మెనూను అమలు చేయాలి

కల్లూరు మండల విద్యాధికారి ఆఫీసు ముందు ధర్నా

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ చార్జీలు పెంచిన తర్వాతనే మెనూ అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన పథకం యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కల్లూరు మండల విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిఐటియు నాయకులు జి. ఏసు అధ్యక్షత వహించారు. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయి బాబా, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ గౌరవాధ్యక్షులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ నూతన మెనూ అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మెనూ అమలు చేయడం ప్రస్తుత ధరలకు ఏమాత్రం కుదరదని అన్నారు. ఛార్జీలు పెంచకుండా మెనూ అమలు చేయడం సాధ్యం కాదని తెలిపారు. మెనూ ఛార్జీలు పెంచిన తర్వాతనే ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచడానికి రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి తగ్గట్టుగా ప్రభుత్వం నిధులు కేటాయించాలని తెలిపారు. 23 సంవత్సరాల నుండి బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు చాలీచాలని జీతాలకు పని చేస్తూ బిల్లులు రాకపోయినా పథకాన్ని ఆపకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. వేతనాలు పెంచాలని, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతుండడంతో పౌష్టికాహారం అందించాలంటే అప్పులు చేసి ఖర్చు పెట్టాల్సి వస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థికి రూ. 20 చొప్పున పెంచి నూతన మెనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వంద మంది విద్యార్థులకు ఇద్దరు ఉండాలనే నిబంధనలు సడలించి వర్కర్ల సంఖ్యను పెంచాలని, 9, 10వ తరగతులకు వన్డే వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని, ప్రతినెల 5వ తేదీ లోపు బిల్లులు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, నెలకు రూ 12000 వేలు కనీస వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని,అగ్ని ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ మెజర్స్ ఇవ్వాలని, ఇఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు .దీనిని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం ఎంఇఒ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నాయకులు శ్రీరాములు, రమిజాబి, జహారాభి, గంగమ్మ, వెంకటేశ్వరమ్మ, నాగమణి, నాగమ్మ, రజియాబి, ఫరిదా, శ్రీలత, సరస్వతి, జయలక్ష్మి, లలిత, రంగమ్మ, మాధవి, దాని భాయ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.సాయిబాబ

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

• ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డిఎల్‌పిఒ నూర్జహాన్, డిఎల్‌డిఒ ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

వైసిపి బలోపేతానికి కృషి చేద్దామని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. సోమవారం మండలంలోని రామతీర్థంలో సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ పెద్దయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు ఎక్కువయ్యాయని, దాడులను అధిగమించేందుకు గ్రామ, మండల కమిటీలను ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం శ్రీగాయత్రీ మాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జడ్‌పిటిసి దొరబాబు, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన, జిల్లా కెడిసిసి మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, సీనియర్ విలేకరి వెంకన్న, సర్పంచులు తోజయక్షప్ప, హరికృష్ణ, మండల కో కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, సొసైటీ మాజీ సిఇఒ అశోక్, నాయకులు దత్తారెడ్డి, రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏజెంట్ల నిర్వీర్యానికి కుట్ర

• లియాఫీ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, జయన్న



ఆందోళన చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్ర ప్రభుత్వం, ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ ఎల్ఐసి ఏజెంట్ల వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోందని, దాన్ని తిప్పి కొట్టాలని నాయకులు కోరారు. సోమవారం ఎమ్మిగనూరు బ్రాంచిలో గేటు ధర్నా ప్రొటెక్షన్ ప్రోగ్రామ్ చేపట్టారు. ఈ సందర్భంగా లియాఫీ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, జయన్న, ఆర్థిక కార్యదర్శి వీరేష్, బ్రాంచి గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, సౌత్ సెంట్రల్ జోన్ ఛైర్మన్ రమేష్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఆంధ్రయ, పబ్లిసిటీ ఛైర్మన్ సోలమాన్, మహిళా ఏజెంట్ల డెవలప్‌మెంట్ ఛైర్మన్ పి.సునీత మాట్లాడారు. పెంచిన మినిమం పాలసీ విలువ రూ.లక్షకు తగ్గించాలని, 50 ఏళ్ల నుంచి 55 ఏళ్లకు వయస్సును పెంచాలని, కమీషన్ రేటును యథావిధిగా ఉంచాలని కోరారు. నాయకులు అనంత బూరళి, సోమన్న, సూర్యకాంత్ రెడ్డి, అబ్దుల్ గఫూర్, దేవేంద్ర మూర్తి, ఆనందయ్య శెట్టి, రాజగోపాల్ శెట్టి, జై కె.శివరాముడు, విష్ణు, ప్రభాకర్, హరి, నాగప్ప, సుభాన్, నారాయణ పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులుగా ఆనంద్

ప్రజాశక్తి - కౌతాళం

ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులుగా ఎస్.ఆనంద్‌ను ఎన్నుకున్నట్లు ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు, గౌరవాధ్యక్షులు ఆనంద్ రాజు, మండల అధ్యక్షులు గుడికంబాలి ఆనంద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. ఎస్సీ కమ్యూనిటీ హాలులో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా శంఖభేరి ఉలిగయ్య, ప్రధాన కార్యదర్శిగా బావిగడ్డ రాము, కోశాధికారిగా పరుసు, ప్రచార కార్యదర్శిగా సురేష్, సహాయ కార్యదర్శిగా ఆనంద్, తరుణ్, అధికార ప్రతినిధిగా శివకుమార్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.

కదం తొక్కిన విద్యార్థులు

• కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి
• పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి
• ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆదోని

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కదం తొక్కారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ భారీ ప్రదర్శన చేపట్టారు. విద్యార్థుల నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని కోరారు. డిగ్రీ, ఇంజినీరింగ్, బిఫార్మసీ వంటి ఉన్నత విద్యలో పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024-2025 విద్యా సంవత్సరం ప్రారంభమై 1, 3, 5వ సెమిస్టర్లకు పరీక్ష ఫీజులు కట్టాలని యూనివర్సిటీ నుంచి సర్క్యులర్ వచ్చిందన్నారు. కొన్ని ప్రయివేట్ కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడి గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు చెల్లించుకోలేక మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉందని తెలిపారు. పెండింగ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నవంబర్ 6న చలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గౌస్, నాయకులు శశిధర్, భరత్, సంజయ్, లోకేష్, ఉచ్చీరప్ప, రవితేజ, ఫరీద్ బాష పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టి, తహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడారు. నాయకులు రాము, వినోద్, ప్రవీణ్, కుమార్, అశోక్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** తహశీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు పవన్ తేజ, మేకల రంగస్వామి మాట్లాడారు. గోనెగండ్లలో బీసీ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తికాక గదుల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎస్‌ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, వినయ్, రియాజ్, కుమార్ పాల్గొన్నారు. **ఆలూరు** ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థులు ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేపట్టారు. ఎస్‌ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఉమేష్, ఎస్‌ఎఫ్ఐ మాజీ నాయకులు మైనా పాల్గొన్నారు.



ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో వినతిపత్రం అందిస్తున్న నాయకులు



గోనెగండ్లలో

పాఠశాలను కాంప్లెక్స్‌గా కొనసాగించండి

- ఎమ్‌డి.హళ్లి సర్పంచి జి.సుధాకర్



ప్రజాశక్తి - హోళగుంద


మండలంలోని ఇంగలదహల్ హైస్కూల్‌ను కాంప్లెక్స్‌గా కొనసాగించాలని సర్పంచి జి.సుధాకర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. పాఠశాల దాదాపు 1961 సంవత్సరం నుంచి ఉంటూ ఎంతో మందికి మంచి భవిష్యత్తును అందించిందని తెలిపారు. ఎంతో చరిత్ర కలిగి కాంప్లెక్స్‌లు వచ్చినప్పటి నుంచి కూడా ఇప్పటి వరకు అన్ని మౌలిక వసతులు, 6.50 ఎకరాల స్థలం, గ్రౌండ్, బాయ్స్ హాస్టల్, 20 మంది బోధన సిబ్బంది, స్కూల్ కాంప్లెక్స్‌కు సంబంధించి 9 పాఠశాలలతో పక్కన గ్రామాల్లో మంచి పేరు ఉందని చెప్పారు. ఇంత చరిత్ర కలిగిన స్కూల్ కాంప్లెక్స్‌ను తీసివేయాలనే ఆలోచన మంచిది కాదని తెలిపారు. ఇంగలదహల్ స్కూల్ కాంప్లెక్స్‌ను తీసివేస్తే ఆ స్కూల్‌కు సంబంధించిన గ్రామాల ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.

ఆదోనిని 4 మండలాలుగా విభజించాలి

- ముఖ్యమంత్రి బాబుకు ఎమ్మెల్యే పార్థసారథి వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలాన్ని నాలుగు మండలాలుగా విభజించి అధికార వికేంద్రీకరణ చేసేందుకు సహకరించాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలోని సిఎంఒ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడారు. ఆదోని రూరల్ మండలం రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద మండలమని తెలిపారు. ఒకే మండలం ఉండడం కారణంగా అధికారులు తక్కువగా ఉండడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు కూడా తక్కువ రావడం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పారు. రాష్ట్రంలోని వేరే నియోజకవర్గాల కన్నా ఎక్కువ నిధులిస్తేనే ఆదోనిలోని తాగు, సాగునీటి సమస్యలు, రోడ్ల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రూ.25 కోట్ల ఉపాధి నిధులు మండలానికి కేటాయించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజా సమస్యలపై పోరాడాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సమస్యలపై ప్రతి కార్యకర్త నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. సోమవారం సిపిఎం 3వ పట్టణ మహాసభ తేరు బజార్‌లోని శ్రీపద్మశాలి కల్యాణ మండపంలో ఎ.సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక ధరలు విద్యుత్ చార్జీల పెంపుతో భారాలు మోపుతున్నాయని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో నెలకొన్న సమస్యలపై నిరంతరం అధ్యయనం చేయాలని కోరారు. ఎమ్మిగనూరులో అత్యధికంగా ఉన్న చేనేత కార్మికులకు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఎమ్మెల్యే హామీఇచ్చారని తెలిపారు. టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని చెప్పారు. పట్టణ జనాభా విస్తరణ వల్ల తాగునీటి సమస్య జటిలమవుతోందని, గతంలో ఏళ్ల క్రితం నిర్మించిన పాత పైపులైన్ స్థానంలో కొత్త పైపు లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించాలని తెలిపారు. పట్టణంలోని వీధుల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా, ప్రమాదకరంగా ఉందన్నారు. కర్నూలు- కోడుమూరు రోడ్డు గుంతలమయమై రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన ఈ రోడ్డు నిర్మించాలని కోరారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థకు సంబంధించి నిధులు కేటాయించి, నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పట్టణంలో జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడే సమగ్ర చట్టాన్ని అమలు చేసి, కార్మికుల జీవితాలు మెరుగుపడే వేతనాలు నిర్ణయించాలని కోరారు. గతంలో ఎమ్మిగనూరు పట్టణ, మండల రైతులు ఎల్ఎల్‌సి నీటి ఆధారంగా పంటలు పండించే వారని తెలిపారు. ఎల్ఎల్‌సి ఆయకట్టు రైతులకు నీరందించాలని కోరారు. పట్టణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, యువత ఉపాధికి అవసరమైన ప్రభుత్వ పరిశ్రమలను నిర్మించాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు సిపిఎం పట్టణ కమిటీ భవిష్యత్తులో ప్రజలను సమీకరించి పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శిగా పి.గోవిందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సి.హనుమంతు, బి.రాముడు, యు.రమేష్, కృష్ణ, యు.లక్ష్మీనరసయ్య, ఎ.సురేష్, 11 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ పాల్గొన్నారు.



సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్



పాత భవనంలోనే విద్యా బోధన

కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం

- అందులోనే విద్యా బోధన
- కొత్త భవనం నిర్మించాలంటూ గ్రామస్తుల మొర

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని మార్లమడికి గ్రామంలో కూలడానికి సిద్ధంగా ఉన్న పాత భవనంలోనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పెచ్చులూడి విద్యార్థులపై పడి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని, కొత్త పాఠశాల భవనం నిర్మించాలని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 5వ తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, కొంతమందికి ఆర్‌డిటి భవనంలో విద్యనందిస్తే స్థలం సరిపోక మిగిలిన వారికి పాత భవనంలోనే విద్యా బోధన చేపడుతున్నారని తెలిపారు. ఈ భవనం చాలా ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు-నేడు కింద నిధులు మంజూరైనా ఇంతవరకు గ్రామంలో ఒక్క గది కూడా నిర్మించిన దాఖలాలు లేవని వాపోయారు. ఇక్కడ విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలూ లేవని, ఇక్కడ పరిస్థితులు మండల విద్యాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అత్యవసరమున్న చోట గదుల నిర్మాణం చేపట్టకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల భవనం నిర్మించి విద్యార్థుల విద్య కుంటుపడకుండా చూడాలని కోరారు.

వృత్తి విద్యలోనూ రాణించాలి

- కెజిబివి ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - హాలహర్వి

విద్యార్థినులు విద్యతోపాటు వృత్తి విద్యలోనూ రాణించాలని కెజిబివి ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. సోమవారం హాలహర్వి కెజిబివిలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా వృత్తి విద్య కోర్సు అప్పరేల్ ట్రేడ్ స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి సోమవారం అవగాహన కల్పించారు. ఆలూరులోని టెక్స్‌టైల్స్, పెద్ద పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు, ఇతర అంశాలపై ఒకేషనల్ ట్రైనర్ జి.సునీత అవగాహన కల్పించారు. పరిశ్రమను సందర్శించి ఎంబ్రాయిడింగ్ వర్క్, జిగ్ జాగ్, హ్యాండ్లూమ్ యూనిట్‌ను పరిశీలించారు. వృత్తి విద్య ఆవశ్యకతను విద్యార్థులకు వారు తెలియజేశారు.



ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం: యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తోందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దేవపాల్, వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను మండల అధ్యక్షులు రంగన్న అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ... హక్కులు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం పోరాటం చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పని సర్దుబాటు లోపం ఉందని, ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. జిఒ 117పై ఏ సంఘమూ నోరు మెదపకపోతే యుటిఎఫ్ ఆందోళన చేసిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే పేద విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. అనంతరం మండల కమిటీని ఎన్నికల అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షులుగా డిఎన్.కాసయ్య, కార్యదర్శిగా సి.బాబు, సహాయ అధ్యక్షులుగా కె.సువర్ణమ్మ, ఆదెప్ప, ఆర్థిక కార్యదర్శిగా ఖలీల్, జిల్లా కౌన్సిలర్లుగా కృష్ణవేణి, పవన్ కుమార్, మొద్దీన్ బాష, ప్రతాప్ రెడ్డి, మండల కార్యదర్శులుగా సుధాకర్, గిరిజాదేవి, లక్ష్మన్న, రఘునాథ్‌ను ఎన్నుకున్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకప్పకు సన్మానం

ప్రజాశక్తి-దేవనకొండ

ఆదోని లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ దేవనకొండ మండలానికి బదిలీపై వచ్చిన వెంకప్పను సన్మానించారు. సోమవారం కరిడికొండ సర్పంచి హనుమంతు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.ఉచ్చీరప్ప, ఎఫ్ఆర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.ఉచ్చీరప్ప సన్మానం చేశారు. విహెచ్‌పి జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, మల్లికార్జున రెడ్డి, రఘునాథ్, ఆచారి, రాముడు, వీరాచారి, సత్తన్న, మహానంది పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి

- డిప్యూటీ కమిషనర్ విజయ రాజు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో సౌకర్యాల కల్పనకు సమన్వయంతో పనిచేద్దామని డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. సోమవారం డిప్యూటీ స్థపతి నాగేశ్వర్ నెహ్రూ, దేవదాయ శాఖ ఎస్ఇ సిరుగుప్ప సతీష్, అసిస్టెంట్ స్థపతి సుబ్రహ్మణ్యం, దేవదాయ కర్నూలు ఎఇ దేవేందర్ రెడ్డితో పుణ్యక్షేత్రం పరిసరాల్లో అభివృద్ధి, భక్తుల సౌకర్యాల ఏర్పాటు కోసం పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు భక్తులు పెరుగుతున్నారని, పుణ్యక్షేత్రానికి వస్తున్న వారి కోసం వసతులు కూడా పెంచాలని తెలిపారు. ఫిబ్రవరిలో పుణ్యక్షేత్రంలో నిర్వహించే కుంభాభిషేకానికి దేవాలయం అభివృద్ధితో పాటు భక్తుల సౌకర్యాల కల్పనకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అభివృద్ధితో పాటు ఏయే పనులు చేయాలో చర్చించారు. ఉత్తరాయణంలో గణపతి, నవగ్రహాలు, హోమం శాల, ధ్వజస్తంభం, అభిషేక మండపం, క్యూలైన్లు, దేవాలయం చుట్టూ లెవెలింగ్, మాడ విధులు, ఐమాక్స్ విద్యుత్, కలశ ప్రతిష్ఠాపన, గోపురానికి రంగులు, వసతి గదులకు ఆధునీకరించి ప్రస్తుతం 50 గదులు ఆన్‌లైన్ సౌకర్యం, పనులను వేగవంతం చేయాల్సి ఉందని తెలిపారు. ఫిబ్రవరిలో నిర్వహించే కుంభాభిషేకానికి ముందుగానే ఈ పనులను పూర్తి చేయాలని సూచించారు. అన్నదాన సత్రానికి మోడలింగ్, పాకశాల, లడ్డు పోటు, వెయ్యి మంది భక్తులకు సరిపోయే డార్మెటరీ హాల్స్ (అన్ని సౌకర్యాలతో రెండు షెడ్లు), ఆంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణం, గోశాల, 2 లక్షల లీటర్ల కెపాసిటీ గల ఒహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో ఈ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని వివరించారు. పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి, అర్చకులు నాగరాజు స్వామి, ఈరన్న స్వామి, మల్లయ్య స్వామి, ప్రముఖులు సంజీవరెడ్డి పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులను పెంచి పట్టణ పారిశుధ్యాన్ని పరిరక్షించాలని కోరారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు నాగరాజు, మునీంద్ర, కేశన్న, సాల్మన్, రంగస్వామి, లక్ష్మన్న, నరసింహులు, వెంకటేశులు, రమణ, ప్రేమ్ రాజ్, బాలు, కిషోర్, రైతుసంఘం నాయకులు అబ్దుల్లా, కాలప్ప పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు, చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మిక సంఘం నాయకులు భరణి కాలప్ప, సిఐటియు పట్టణ అధ్యక్షులు గోవిందు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ శేషఫణికి, ఎంపిడిఒ బంగారమ్మకు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీఇచ్చిందని తెలిపారు. హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. చేనేత కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికులకు ముద్ర రుణాలను మంజూరు చేయడంలో కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. చేనేత కార్మికులు నేసిన పట్టు వస్త్రాలకు ఎమ్మిగనూరులోనే ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీనివాసులు, రాజు, కామర్తి లక్ష్మన్న, వీరేష్ పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

అయ్యప్ప భక్తులు ఆదోని నుంచి శబరిమలకు పాదయాత్రగా బయల్దేరారు. సోమవారం 16వ సారి పాదయాత్ర, గురుస్వామి శ్రీనివాస్ ఆచారి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ యాత్ర అనంతపురం, బెంగళూరు, సేలమ్, డిండిగల్, తేని, కుంబ్లీ, పులిమేడ్ మీదుగా నెలరోజుల్లో శబరిమల చేరుకుంటామని శ్రీనివాస్ ఆచారి తెలిపారు. పంపారెడ్డి, మల్లి, ప్రహ్లద, రంగన్న, శ్రీనివాస్ రెడ్డి, మొత్తం 15 మంది పాదయాత్రగా బయల్దేరారు.



పాదయాత్రగా బయల్దేరిన భక్తులు

టిడిపి బలోపేతానికి కృషి : కృష్ణమ్మ


ప్రజాశక్తి - ఆదోని

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రణాళిక బద్ధంగా అధిష్టానం కృషి చేస్తోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. సోమవారం ఆదోనిలోని ఇందిరానగర్, మహాయోగి లక్ష్మమ్మ కాలనీలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాజకీయ పార్టీల మనుగడ కొనసాగాలంటే కార్యకర్తలు రథసారథిగా పని చేయాలని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మారుతీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇందిరానగర్ వీరేష్, రామకృష్ణ, భరత్, రాఘవరెడ్డి, చిన్న భరత్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

నందవరం : కార్యకర్తలకు టిడిపి అండగా ఉంటుందని జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పావతి తెలిపారు. నందవరంలోని లింగాయత్ వీధిలో పుష్పావతి, నాగరాజు గౌడ్‌లు టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వం పొందిన కార్యకర్త ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమాను టిడిపి అందిస్తుందని చెప్పారు. నరసప్ప, జగదీష్, నాగరాజు, రవి, చాంద్ పాల్గొన్నారు.



నందవరంలో మాట్లాడుతున్న నాయకులు



కొనుగోలును ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

సిసిఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వివిధ గ్రామాలు, మండలాల్లో రైతులు పత్తి పంటను సిసిఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, ఆదోని సెంటరు జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ గౌతం కోరారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ జిన్నింగ్ ఫ్యాక్టరీ పూజా కార్యక్రమంతో పత్తి కొనుగోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. మార్కెట్ పరిధిలో ఆరు పత్తి మిల్లులను సిసిఐ కొనుగోలు కేంద్రాలుగా ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. పత్తికి క్వింటాల్ రూ.7,521 ప్రభుత్వం ధర ప్రకటించిందని, 8శాతం తేమ ఉన్నప్పుడే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తారని చెప్పారు. తేమ శాతం పెరిగితే మద్దతు ధర తగ్గుతుందన్నారు. 9 శాతానికి రూ.7,445.79, 10 శాతానికి రూ.7,370.58, 11 శాతానికి రూ.7,295.37, 12 శాతానికి రూ.7,220.16 చెల్లిస్తారని వివరించారు. పత్తిలో తేమ శాతం 12 కంటే ఎక్కువ ఉంటే సిసిఐ కొనుగోలు చేయదని తెలిపారు.

స.హ చట్టంపై అవగాహన ఉండాలి : ఎఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న సేవల గురించి సమాచార హక్కు చట్టం కింద ప్రతి పౌరుడు తెలుసుకోవచ్చని ఎఒ జీరా గణేష్ సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాచారం పొందడం ప్రాథమిక హక్కు అని, ఈ చట్టం 2005లో అమలులోకి వచ్చిందని తెలిపారు. సమాచారం ఆవశ్యకతను బట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో తీసుకోవచ్చని చెప్పారు. దాని కోసం కేవలం రూ.10 డిడిని, కాపీని దరఖాస్తుకు జత చేసి సంబంధిత అంశాన్ని కోరవచ్చని తెలిపారు. **కౌతాళం** కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై సదస్సు నిర్వహించారు. ఎఒ శేషాద్రి మాట్లాడుతూ... ఆర్‌టిఐ ద్వారా సమాచార హక్కు చట్టం 2005, ప్రతి వ్యక్తి కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్ ఆపరేషన్

కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీ లో ఏకకాలంలో దాడులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్పి జె. బాబు ప్రసాద్ పర్యవేక్షణలో సోమవారం తెల్లవారుజామున కర్నూలు నాల్గవ పట్టణ సిఐ మధుసుధన్ గౌడ్ ఆధ్వర్యంలో కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆరుగురు సిఐలు, ఐదుగురు ఎస్ఐలు, 75 మంది పోలీసులు పాల్గొన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్ళల్లో దాడులు నిర్వహించారు. వీకర్ సెక్షన్ కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో మెలగాలని తెలియజేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటే అటువంటి వారి సమాచారాన్ని అందించాలన్నారు. తగిన పారితోషికం ఇస్తామని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు అధికారులు తెలిపారు. కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీలో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సిఐలు మధుసూధన్ గౌడ్, ప్రవీణ్ కుమార్, నాగరాజరావు, పవన్‌కుమార్, పార్థసారథి రెడ్డి, ఎస్ఐలు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.


వీకర్ సెక్షన్ కాలనీలో పోలీసుల సమావేశం

అర్జీ ఇచ్చారని తాగునీటి సరఫరాను నిలిపేశారు

సుందరయ్య పార్కును పట్టించుకోండి : కమిషనర్‌కు పిపిఎస్ఎస్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య పార్కుతో పాటు సమస్యలన్ని పరిష్కరిస్తామని కమిషనర్ రవీంద్రబాబు హామీ ఇచ్చారని పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు సుందరయ్య పార్కు నిర్మాణంతోపాటు, శాంతినగర్ కాలనీ లో రోడ్లు మురికి కాలువలు ఏర్పాటు చేయాలని గతవారం అర్జీలు ఇచ్చామని.. సమస్యలపై స్పందించకపోగా బాగున్న నీటి సరఫరాను నిలిపివేసి కొత్త సమస్యలు సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మల్లికార్జున, చంద్ర నాయక్, శ్రీనివాసులు, మహబూబ్ బాషా, రాఘవేంద్రల ప్రతినిధి బృందం నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబుకు మరో అర్జీ ఇచ్చారు. ఎన్ని అర్జీలు ఇచ్చినా సంబంధిత ఇంజనీర్లు చిన్న పని కూడా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కరించాలని గతంలో ఇచ్చిన అర్జీల వివరాలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. గత పాలకుల అనుచరుడైన ఒక కాంట్రాక్టర్ సుందరయ్య పార్కు గోడను కూల్చేశారని పేర్కొన్నారు. డంపు యార్డుగా ఉపయోగించుకున్నా.. సంబంధిత ఇంజనీర్లు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సుందరయ్య పార్కు నిర్మాణం గురించి ఇంజనీర్ ను అడిగి వివరాలు తెలుసుకొని కమిషనర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుందరయ్య పార్కు నిర్మాణం, శాంతినగర్ కాలనీలో సమస్యలు, నిరుపయోగంగా ఉన్న కోటి రూపాయలతో నిర్మించిన భారీ మురుగు కాలువతో పాటు ఆ ప్రాంతంలో తాగునీటి సమస్యలపై తనతో పాటు ఇంజనీర్ల టీం పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు ఇ.పుల్లారెడ్డి, తదితరులు

రోడ్డున పడిన సెక్యూరిటీ గార్డులు

మాకు డ్యూటీ ఇప్పించండి సార్-జిజిహెచ్‌లో సెక్యూరిటీ గార్డ్స్ ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డ్యూటీ నుండి అకారణంగా తొలగించిన సెక్యూరిటీ గార్డులజు డ్యూటీ లోనికి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ సెక్యూరిటీ ఆఫీసు ముందు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు తొలగించిన చంద్రబాబు, మద్దిలేటి, యోగేష్, సురేష్ సెక్యూరిటీ గార్డ్స్ ధర్నా నిర్వహించారు. తొలగించబడిన సెక్యూరిటీ గార్డ్స్ మాట్లాడుతూ 8 సంవత్సరాల నుండి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. గత కాలంలో అనేక రకాల ఏజెన్సీలు వచ్చినా సక్రమంగా పని చేయించుకుని కార్మికులకు సరైన జీతం ఇచ్చారని తెలిపారు. ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ వచ్చిన తర్వాత కార్మికులకు సరైన జీతం ఇఎస్ఐ, పిఎఫ్ లు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. సరైన జీతం ఇవ్వాలని ఈఎస్ఐ పీఎఫ్ సక్రమంగా ఇవ్వాలని అడిగినందున ఏజెన్సీ ఎండి వారి వ్యక్తిగత ఏజెంట్ లైన ఫిరోజ్ ఖాన్, రవితేజ సూపర్వైజర్లను రెచ్చగొట్టి లేని ఆరోపణలు మాపై చేయించి డ్యూటీ నుండి అక్రమంగా తొలగించారని అన్నారు. మా లాగా నిజాయితీగా పని చేసిన చాలా మంది సెక్యూరిటీ గార్డ్స్ ను, సూపర్ వైజర్లను అక్రమంగా తొలగించి వారి స్థానంలో లక్షల రూపాయలు వసూలు చేసుకుని కొత్తవారిని రిక్రూట్మెంట్ చేయలేదన్నారు. ఏజెన్సీ ఎండి అండ ఉండటం వలన సెక్యూరిటీ గార్డ్స్ దగ్గర డబ్బులు తీసుకొని మంచి డ్యూటీలు వేయడం, మహిళా సెక్యూరిటీ గార్డ్స్ ను లొంగదీసుకునే ప్రయత్నం చేయడం, లొంగని వారిని డ్యూటీ నుండి తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. లైంగిక వేధింపుల కేసు కూడా వీరిపై రిజిస్ట్రేషన్ అయిందని గుర్తు చేశారు. ఇలాంటి సూపర్వైజర్లను తక్షణమే డ్యూటీ నుండి తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు వచ్చినా లెక్కచేయకుండా ఎండి వాళ్ళని ఇప్పటి వరకు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలు ఏజెన్సీ వారికి హాస్పిటల్ అధికారులకు విన్నవించుకున్న ఏజెన్సీలు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పట్టించు కోవడంలేదని బాధ వ్యక్తం చేశారు. లేబర్ అధికారులకు సమస్యను పరిష్కరించమని కోరినా సంబంధం లేదన్నట్లు వ్యహరించడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, హాస్పిటల్ సూపరింటెండెంట్, కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకొని అకారణంగా తొలగించిన మమ్ములను డ్యూటీలోనికి తీసుకోవాలని ఎక్స్ ఫర్ట్ ఏజెన్సీ ఎండి కి ఆర్డర్ చేయాలని, క్రిమినల్ కేసులు ఉండి డ్యూటీలో కొనసాగుతున్న ఫిరోజ్ ఖాన్ రవితేజ లను వెంటనే డ్యూటీ నుండి తొలగించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షాన మా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తొలగించబడిన సెక్యూరిటీ గార్డ్స్ పాల్గొన్నారు.



జిజిహెచ్ రేడియాలజీ విభాగంలో ఫ్యూజి సిఆర్ రీడర్ ప్రింటర్ ఏర్పాటు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రేడియాలజీ విభాగంలో ఫ్యూజి సిఆర్‌రీడర్ ప్రింటర్ ఏర్పాటు చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రేడియాలజీ విభాగంలో ఫ్యూజి సిఆర్‌రీడర్ ప్రింటర్‌ను ఆసుపత్రి సూపరిండెంట్ చొరవతో తిరుపతి ఎస్‌విఆర్‌ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా ఉన్న ఫ్యూజి సిఆర్‌రీడర్ ప్రింటర్‌ను అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడి కర్నూలు ఆసుపత్రిలో పేషెంట్ల రద్దీ దృష్ట్యా మాకు కేటాయించమని అడిగిన వెంటనే ఎస్‌పిఆర్ ఆర్‌జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు స్పందించారు. అనంతరం వారు మాకు మిషన్‌ను అందించడం జరిగిందని డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ మిషన్ల ద్వారా పేషెంట్లకు తొందరగా ఎక్స్రే ఫిలిమ్స్ ప్రింట్లు ఇస్తామన్నారు. దీని ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. పేషెంట్లకు ఈరోజు నుండి సిఆర్.రీడర్ ప్రింటర్ సేవలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేయడమే నా లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ విభాగపు వైద్యులు డాక్టర్ హరినాథ్, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, చీఫ్ రేడియోగ్రాఫర్ రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ధర టన్నుకు రూ.88 తగ్గింపు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక కు సీనరేజీ ఫీజు, డీఎంఎఫ్, మెరిట్ కింద మెట్రిక్ టన్నుకు రూ. 88 ఉండగా, ప్రస్తుతం ప్రభుత్వం ఆ ఫీజులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు..సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ఇసుకను తరలించకుండా అంతరాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు..నదీ పరీవాహక గ్రామాల ప్రజలు పంచాయతీ సెక్రెటరీ ల అనుమతితో సొంత తపనులు, గ్రామ అవసరాలు,కమ్యూనిటీ పనుల కోసం యంత్రాలు లేకుండా ఎద్దుల బండ్లు లేదా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేసుకోవచ్చునని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకమైన యాప్ కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు.. రీచ్ లు, డిసిల్టేషన్ పాయింట్ల వద్దకు అనుమతించిన ఇసుకను రవాణా చేసే వాహనాలకు ఉచిత ఇసుక రవాణా వాహనం అనే బ్యానర్ ఉండడంతో పాటు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ లేదా డ్రైవర్ల మొబైల్ లలో జీపిఎస్ ఎనేబుల్ నోటిఫికేషన్ ఉండాలన్నారు... బోర్లు,బ్రిడ్జి ల వద్ద ఇసుక తవ్వకాలు జరుగకుండా వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇసుక రీచుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇసుక ట్రాన్స్ పోర్ట్ ను పటిష్ఠంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక లభ్యత ఉన్న ప్రదేశాలను గుర్తించాలని క కమిటీ సభ్యులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్, గనుల శాఖ డిడి రవిచంద్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, డిపిఓ భాస్కర్, డిటిసి శాంతకుమారి, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు..

ప్రకృతి వ్యవసాయ బుక్ లెట్స్ ఆవిష్కరణ

కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన ప్రకతి వ్యవసాయానికి సంబంధించిన బుక్‌లెట్స్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష సోమవారం ఆవిష్కరించారు. ఈ బుక్‌లెట్స్ ను జిల్లాలోని 25 మండలాలలో గల 141 రైతు సేవ కేంద్రాలకు, 247 గ్రామ ఐక్య సంఘాలలోని మహిళా రైతులకు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ కోరారు.

నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదన్‌రావు ప్రమాణ స్వీకారం

ం0ంం

మధుమణి సమావేశ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో నంద్యాల ఐఎంఏ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదన రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదనరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. డాక్టర్ రవికృష్ణ దేశంలో, రాష్ట్రంలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి ఎంపికి వినతి పత్రం అందజేశారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీగా ఎన్నిక కావడం వైద్యులందరికీ గర్వకారణం అన్నారు. డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైద్యుల సమస్యల పరిష్కారానికి వైద్యురాలిగా, ఎంపీగా సహకారం అందజేస్తానని అన్నారు. దేశవ్యాప్తంగా వైద్యులపై పెరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న వైద్యుల రక్షణ చట్టాన్ని బలోపేతం చేయడానికి, కేంద్రస్థాయిలో వైద్యుల రక్షణ చట్టం తీసుకురావడానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. వివిధ సమస్యలను సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. నంద్యాల వైద్యులు సేవాభావం కలిగి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశంసించారు. డాక్టర్ మధుసూదన్ రావు అధ్యక్షతన రానున్న సంవత్సరంలో నంద్యాల జిల్లాలో వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని కోరారు. డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని నంద్యాల వైద్యులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఎంపీ చేతుల మీదుగా డాక్టర్ వసుధరాణి, డాక్టర్ మధుసూదన రావు లను వైద్యులు సత్కరించారు. ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, మహిళా వైద్య విభాగం నాయకులు నాగమణి, నర్మదా, కల్పన, అరుణకుమారి నంద్యాల వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి

బాస్కెట్ బాల్ పోటీలో విజేతలు గా చిత్తూర్, కర్నూల్, రాజమండ్రి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : అవుట్డోర్ స్టేడియం లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బాస్కెట్ బాల్ పోటీలో విజేతలుగా చిత్తూర్ ,కర్నూల్ , రాజమండ్రి జిల్లా జట్లు ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. భాస్కట్ బాల్ లీగ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ముగింపు లో ఎంపి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీ, నగదు పురస్కారాలు అందజేశారు. క్రీడాకారులు జీవితంలో ముందుకు వెళ్లి యువత సన్మార్గంలో నడవాలని తెలిపారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుండి వినతుల స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి, అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారుల నుండి కమిషనర్ ఫిర్యాదులు స్వీకరిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎంఇలు సత్యనారాయణ, శేషసాయి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, డిపిఒ ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పన్నులు చెల్లించి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి బనగానపల్లె : గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రంథాలయ పన్నును చెల్లించి గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని గ్రంథాలయ అధికారి బషీర్ హమ్మద్ కోరారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని పుదుబ్బవరంలో ఎంపిడిఒ బివి రమణ అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు.బషీర్ హమ్మద్ మాట్లాడుతూ పదేళ్ల నుండి పేరుకుపోయినపన్ను బకాయిలను వెంటనే విడుదల చేయించాలని తద్వారా గ్రంథాల యాల అభివద్ధికి సహ కరించాలన్నారు. ఎంపిడిఓ రమణ మాట్లాడుతూ గ్రంథాల యాలకు గ్రామ పంచాయతి కార్యదర్శులు బకాయిపన్నును వెంటనే చెల్లించాలన్నారు...

నేడు సిపిఐ రాష్ట్ర బందం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 29న కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పందికోన హంద్రీనీవా రిజర్వాయర్, ప్రధాన కాలువను సిపిఐ రాష్ట్రబృందం పరిశీలించడానికి పర్యటిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పందికోన రిజర్వాయర్ పనులను పూర్తి చేసి పూర్తిస్థాయిలో కుడి, ఎడమ కాలువల ద్వారా పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలని, హంద్రీనీవా ప్రధాన కాలువను వెడల్పు చేసే విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్లో నిధులు కేటాయింపులు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి చేయడానికి సిపిఐ రాష్ట్ర బృందం పర్యటిస్తుందన్నారు. ఈబృందంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, డి.జగదీష్ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

జాగ్రత్తలతో బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించవచ్చు


మెడికవర్ హాస్పిటల్ న్యూరో పిజీషియన్ డాక్టర్ నాగసురేష్ సలహాలు సూచనలు

నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మనిషిలోని ముఖ్యమైన అవయవాల్లో మెదడు ఒకటి. శరీరం మొత్తాన్ని నడిపేది ఈ అవయవమే. మెదడు ఆరోగ్యంగా ఉన్నప్పుడు శరీరం అదుపుతప్పకుండా పనిచేస్తుంది. అలాంటి మెదడులో చిన్న సమస్య తలెత్తినా 'బ్రెయిన్ స్ట్రోక్' ఏర్పడుతుంది. ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా వచ్చేదే బ్రెయిన్ స్ట్రోక్. రక్తప్రసరణలో అవరోధం కలగడం , నరాలు చిట్లడం ప్రధాన కారణాలు. మెదడకు ఆక్సిజన్ , పోషకాలు తీసుకొనివెళ్లే రక్తనరాలు చిట్లడం , రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడం వలన , మెదడులో ఆ భాగం కణమరణానికి దారి తీసి స్ట్రోక్‌కు కారణం కావచ్చు.' అని మెడికవర్ హాస్పిటల్ న్యూరో పిజీషియన్ డాక్టర్ డాక్టర్ నాగసురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం....

బ్రెయిన్ స్ట్రోక్స్ వచ్చిన మొదటి గంట అంటే 60 నిమిషాల్లో ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందేలా చేస్తే ప్రాణాపాయం తప్పినట్లే. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషమూ, ప్రతీ క్షణం విలువైనదే. ఒక్క క్షణం ఆలస్యం చేసినా పరిస్థితి విషమించవచ్చు. కొన్ని సందర్భాల్లో పరిస్థితి చేయి దాటిపోవచ్చు. స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన మొదటి గంటలోపు, కనీసం నాలుగున్నర గంటల్లోపు ఆస్పత్రి చేరితే ప్రాణాపాయంతో పాటు వైకల్యం నుంచి కాపాడవచ్చు. మారుతున్న జీవనశైలిలో భాగంగా స్ట్రోక్స్ అనేవి పెరుగుతున్నాయి. ఒకప్పుడు 50 ఏళ్ళు దాటితేనే ఇటువంటి సమస్య వచ్చేది. కానీ ఇప్పుడలా కాదు. 25 ఏండ్ల వయసు దాటిన ప్రతి నలుగురిలో ఒకరు తమ జీవనకాలంలో స్ట్రోక్ బారిన పడుతున్నారు. చిన్న వయసు వారు స్ట్రోక్ బారిన పడటం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతాయి. బ్రెయిన్ స్ట్రోక్ రెండురకాల ఇస్కీమిక్ స్ట్రోక్, హెమరైజ్డ్ స్ట్రోక్. మెదడులోని రక్తనాళాల్లో రక్త ప్రసరణ సక్రమంగా లేకపోవడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలు చచ్చుబడిపోతాయి. దీన్నే ఇస్కిమిక్ స్ట్రోక్ అంటారు. మెదడులోని రక్తనాళాలు చిట్లినప్పుడు అంతర్లీనంగా రక్తస్రావం జరుగుతుంది. దీన్నే హెమరేజిక్ స్ట్రోక్ అంటారు.



ప్రతి ఒక్కరు స్ట్రోక్ లక్షణాలను ఎఫ్ఎఎస్‌టి అనబడే శబ్దంతో గుర్తు పెట్టుకోవడంతో పాటూ గమనించవచ్చు. ముఖము ఒక ప్రక్కకు ఒరుగుతుండడం, చేతులు ఒకచేయి లేదా కాలులో బలహీనత ఏర్పడటం. మాట్లాడటంలో ఇబ్బంది, సరిగ్గా మాట్లాడలేకపోవడం ఈ లక్షణాలు కాని కలిగి ఉంటే వెంటనే అత్యవసర సేవల వారికి కాల్ చేయాలి.


స్ట్రోక్ లక్షణాలు: అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలులో తిమ్మిర్లు లేదా బలహీనంగా అనిపించడం అకస్మాత్తుగా మాట్లాడటంలో ఇబ్బంది, విషయాలు అర్థం చేసుకోలేకపోవడం, ఒకటి లేదా రెండు కంటి చూపుల్లో ఇబ్బందులు ఏర్పడటం. నడవడానికి ఇబ్బంది, సరిగ్గా బ్యాలెన్స్ చేసుకోలేకపోవడం, ఎటువంటి కారణం లేకుండా విపరీతమైన తలనొప్పి.

స్ట్రోక్ కి కారణాలు : యువతలో స్ట్రోక్ కి కారణాలు పనిలో వత్తిడి, స్మోకింగ్ , మద్యపానం అలవాట్లు వల్ల స్ట్రోక్‌కు గురిఅవుతున్నారు. జీవన శైలిలో మార్పులు ,శారీరక శ్రమ లేకపోవడం, మధుమేహం , రక్తపోటు , రక్తంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ ఎక్కువగా ఉండటం , ఒబేసిటీ ఉన్న వారు స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ. అన్యూరిజం వంటి శరీర నిర్మాణ లోపాలు, పుట్టుకతో జన్యుపరమైన లోపాలు కారణంగా రక్తం గడ్డకట్టే గుణం ఉన్నవారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదముంది. గుండె జబ్బులు ఉన్నవారికి బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు . తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల స్ట్రోక్ నుండి మనల్ని మనం కాపాడు కోవచ్చు , ఇతరులని కాపాడవచ్చు.

మద్దికేరలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేరలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవికుమార్ కోరారు. తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యావిధానంలో 100 రోజులలోనే సమూలమైన మార్పులు తీసుకొస్తామంటు యువగళం పాదయాత్రలో చెప్పి ఇప్పుడు కాలయాపన చేయటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగులో ఉన్న రూ.3,480 కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలన్నారు. డిగ్రీలో అమలు అవుతున్న మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేసి, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు.తల్లికి వందనం డబ్బులను వెంటనే జమ చేయాలని, సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించి, మెస్ ఛార్జీలు నెలకు రూ.3000లకు పెంచి మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎపి మోడల్ స్కూల్ కాంపౌండ్ వాల్ ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు తరుణ్ ,ఎస్ఎఫ్ఐ నాయకులు వేణు,అనిల్,ప్రకాష్ ,తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


జాతీయ కమిషన్ సభ్యులు రామచందర్‌కు వినతి ఇస్తున్న సంఘం నాయకులు

బుడగ జంగాలకు న్యాయం చేయాలి

జాతీయ కమిషన్ సభ్యులు రామచందర్‌ను కలిసిన సంఘం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆంధ్రప్రదేశ్ బుడగ జంగం కులానికి న్యాయం చేయాలని బుడగ జంగం సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం న్యూఢిల్లీ లోక్‌నాయక్ భవన్‌లో షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్‌చందర్‌కు ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు తాటికొండ నారాయణ, తూర్పాటి మనోహర్, తాటికొండ కొండన్న, సిరివాటి గిరిధర్ కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ మా జాతి రిజర్వేషన్ సమస్య కేంద్రంలో పెండింగులో ఉంటున్నదనీ, మా ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వాలు తమ నివేదికలను క్షుణ్ణంగా పంపినా న్యాయానికి నోచుకోవడం లేదని అన్నారు. కనుక తమరు చొరవ తీసుకొని న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. స్పందించిన జాతీయ కమిషన్ సభ్యులు మీ సమస్యను 20 రోజుల్లో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర కేంద్ర, ప్రభుత్వ అధికారుల ద్వారా కాల్ ఫర్ రికార్డుతో న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.

అక్రమ మద్యం స్వాధీనం, కేసు నమోదు

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం చనుగొండ్ల గ్రామం వద్ద సోమవారం ఉదయం బోయ ఉరుకుంద అనే వ్యక్తి నుండి 24 ఎంసి విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు సెబ్ సిఐ మంజుల స్థానిక సెబ్ కార్యాలయంలో ఆమె విలేకరులకు వివరించారు. అక్రమంగా మద్యం, మత్తు పదార్థాలు వంటివి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు మండల సెబ్ సిఐ మంజుల, ఎస్ఐ చంద్రమోహన్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని స్థానిక ఉర్దూ వర్సిటీలో విద్యార్థులకు సిబ్బందికి క్రీడా పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను రిజిస్ట్రార్ వి.లోకనాథ హాజరై ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ, త్రోబాల్ క్రీడాంశాలలో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్‌కృపాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.